# పొడుగు డబ్బాతో ప్రత్యక్ష పాఠం

పంతులు చాలా భయస్థుడు. చదువు చెప్పటంలో కూడా గట్టివాడే. తనకు తెలిసిన విషయం చెప్పడంలో వళ్లు దాచుకోడు. పిల్లలను భయ భక్తులలో ఉంచగలడు. కాని ఆయనకు పరీక్షాధికారి అంటే భయము. ఆయన వచ్చి ఏమి లోపం కనిపెడతాడో ఏమి కొంప మునుగుతుందో నని హడలిపోతూ వుండేవాడు.

ఇన్‌స్పెక్టరు వస్తున్నాడని కబురు రాగానే వచ్చింది పంతులు జాగ్రఫీ పుస్తకం తీసి పాత పాఠాలన్నీ తిరగేశాడు. పిల్లలకు జాగ్రఫీ బొత్తిగా రాదు.

పంతులు ఊహించాడు. ఏమనీ అంటే, ఆయన జాగ్రఫీలో వెయ్యదగిన ప్రశ్న ఒకటే నని.

ఏమిటది ? భూమి ఎట్లాగుంది ?

ఈ ప్రశ్న ఆయన తప్పకుండా అడుగుతాడు. ఈ కుర్ర వెధవలు ఏం జెపుతారో ? గుండ్రంగా ఉన్నదీ అని చెప్పగలరా మరచిపోకుండా! పంతులు బాగా ఆలోచించి చివరకు వాళ్లు చెప్పలేరనే నిశ్చయించుకొన్నాడు. అయితే ఒక్కటి. వారి కేదైనా చూపించి గుండ్రంగా ఉందీ అన్న విషయం జ్ఞాపకం వచ్చేలాగున చేస్తే నయం అనుకొన్నాడు.

ఆయనకు రెండు పొడుండబ్బా లున్నవి. ఒకటి చదరంగా ఉన్నది కానీ, రెండోది గుండ్రంగానే ఉంటుంది. అప్పుడాయనకు మంచి ఆలోచన వచ్చింది.

గుండ్రని పొడుండబ్బా పిల్లలకు చూపిస్తూ ఆయన ఇల్లా అన్నాడు పిల్లలతో. ''ఒరేయ్ ఇన్‌స్పెక్టరువచ్చి భూమి ఎల్లాగవుంది అని అడుగుతాడు. ఇదిగో చూడండి ఇల్లాగ వుంది. దీనిని జ్ఞాపకం తెచ్చుకొని భూమి గుండ్రంగా ఉందని చెప్పండి.'

పిల్లలముఖాలు వికసించినై. ఈ గంభీరమైన పరమ సత్యాన్ని జ్ఞాపకం తెచ్చుకొంటానికి ఒక చిన్న ఆధారం దొరికినందులకు కూడా వాళ్ళు చాలా సంతోషించారు.

కాసేపటికి టక్ టక్ మంటూ ఇన్‌స్పెక్టరు రానే వచ్చాడు. పంతులు తెల్లపోయినాడు. పిల్లలు మరీ గాబరా పడ్డాడు.

వచ్చే రావటంతోనే ఆయన కొంప అంతా మునిగి పోయినట్లు పిల్లలవంక భయంకరంగా చూస్తూ ''భూమి ఎట్లా ఉం''దని అడిగాడు.

పిల్లలంతా హడిలిపోయినారు. ఒక్కరూ మాట్లాడ లేదు. ఒక్కరినోరూ పెగిలి మాటరాలేదు. మాస్టరే పాపం చివ్వరకు ఎల్లాగో తెప్పరిల్లి, వాళ్ళకు జ్ఞాపకం రావటానికి తన పొడుంకాయ చూపాడు, ఇన్‌స్పెక్టరకు కనుపించకుండా.

ఒక కుర్రవాడు రపీమని లేచి, 'మాస్టారూ నేనుచెపుతా నండీ'అని కేక వేశాడు. ఇన్‌స్పెక్టరు సంతోషంగా వాడివంక చూచి చెప్పు అని ఉత్సాహ పరిచాడు. ఆ కుంక 'భూమి పొడుము బుర్రలాగుండండి' అని కేక పెట్టాడు.

ఇన్‌స్పెక్టరు ఆశ్చర్యపడి, కుర్రవాడివంక తిరిగి 'సరే బాగానే ఉంది, అయితే గుండ్రంగా ఉందా ? బల్లపరుపుగా ఉందా ?' అని స్పష్టమైన ప్రశ్న వేశాడు.

క్లాసు అంతా—మళ్ళీ నిశ్శబ్దంగా ఉంది ఒక్క క్షణం. ఇంతలో ఒక కుర్రవాడు చటుక్కున లేచి ఏకాదశినాడు గుండ్రంగాను, మిగిలిన రోజులలో చదరంగానూ ఉంటుం దన్నాడు. ఆ పంతులు ఏకాదశినాడు, ఉపవాసముండి, మడికి పనికివచ్చే గుండ్రని నూరేడుకాయ ఉపయోగిస్తాడు. తక్కిన రోజులలో, విదేశీకర్రతో చేయబడ్డ చదరపు డబ్బీని ఉప యోగిస్తాడు.